కథానిక

# జానకి శపథం

"బదరీనాథ్"

"ఆ పరిస్థితుల్లో రాజాయే కాదు-నేనున్నా అంతే చేసేవాణ్ణి. ఇంతకీ-వాడు చేసిన దాంట్లో పీసమైనా తప్పులేదు. వాడు గాబట్టి అంతే చేసి ఊరుకున్నాడుగాని నేనైతే, ఇంకా ఘోరంగా చేసుండేవాణ్ణి" అన్నాడు కాంతా రావు అసలు విషయం చెప్పకుండానే. రాఘవ రావు విసుగ్గా అన్నాడు.

"అసలు జరిగిన సంగతేవిఁటో చెప్పు!"

"చెప్పడాని కేంవుంది" గట్టిగా ఓ దమ్ము పీల్చి సిగరెట్టు బూడిద దులిపి అదోమాదిరిగా పొగ వూదడం అయిపోయేక కాంతారావు చెప్పడం మొదలుపెట్టాడు.

"అసలు జరిగిన సంగతేవిఁటంటే—ప్రభాకరంవాళ్ళింటికి మూడురోజుల క్రితం ఒక అమ్మాయి వచ్చిందిట. ఆ వచ్చిన అమ్మాయి ప్రభాకరం చెల్లెలి స్నేహితురాలట. తీరా ఆ అమ్మాయి వచ్చేసరికి ఇంట్లో వాళ్ళంతా ఊరికి వెళ్ళడం జరిగిందట, అంటే ప్రభాకరం చెల్లెలు గూడాను. అసలా అమ్మాయి ఊళ్ళో లేకుండానే చూసుకుని మరీ వచ్చిందిట యీ వచ్చిన అమ్మాయికూడాను. ఆ అమ్మాయికి ప్రభాకరంమీద చాలా రోజుల్నించీ మమకారం వుందట..."

అంటూంటే రాఘవరావందుకుని "అన్నిటికీ 'ట' లు తగిలిస్తున్నావ్! నీకు ఒక్కటీ నిశ్చయంగా తెలీదా యేవిఁటీ?" అన్నాడు. ఆ ధోరణిలో కాంతరావు—

"తెలియదుట" అన్న ముక్క ఓ పెద్ద 'విట్టు' కింద (వాళ్ళ ప్రాణానికి) మారి కథని కాస్తసేపు కట్టిబెట్టజేసి, ఇద్దర్నీ ఓ రెండు నిముషాలు నవ్వించి, తర్వాత హఠాత్తుగా రాఘవ రావులో తర్వాతి కథని వినాలనే ఉత్సుకతను కలగజేసింది. "ఊఁ. తర్వాతేమయిందేవిఁటీ?"

"విను మరీ! తీరా వచ్చినపిల్ల ఓ రెండు రోజులుండి ప్రభ వచ్చింతరవాత వెళ్తానండి అని అనొచ్చా!అబ్బే! అలాఅన్లేదుట! ప్రత్యేకం ప్రభనుచూసి సాయంత్రం వెళ్ళేదానిలా కబుర్లు చెప్పి, తీరా ప్రయాణమయి అంతా అయాక-ఏవిఁటీ, ప్లాట్‌ఫారమ్మీద నుంచోడం రైలెళ్ళిపోవడం యివన్నీ అయాక తిరిగింటికొచ్చేసి 'ఓ నాలుగురోజులుండి వెడతానండి'అందిట. తనకి వెళ్ళిపోవడానికి ఇష్టంలేక, మంచి అవకాశాన్ని జారవిడుచుకునే శక్తి ఆమెలో లేక ప్రత్యేకం ప్రభాకరంకోసమే ఆ అమ్మాయి ప్రయాణం మానుకుందిట. ప్రభాకరం అందుకు అడ్డుచెప్తాడా! 'ఓ! మహరాజులాగుండండి' అన్నాడు. అంతవరకూ బాగానే వుంది. కాని ఆ రాత్రే వచ్చింది వచ్చిన చిక్కంతాను.

ప్రభాకరం నాన్నగారికి చాలా జబ్బుగా వుందనీ, అర్జంటుగా రమ్మనీ టెలిగ్రాం వచ్చింది. ఎప్పుడూ- సాయంత్రం ఆరున్నర గంటలకి. ఆరుగంటలకి ప్రభ స్నేహితురాలు సినిమాకి వెళ్ళింది. ప్రభాకరం వాళ్ళింట్లో వాళ్ళెవళ్ళూ ఊళ్ళోలేరు. ఉన్నవాడు తనొక్కడు. ఏడు గంటలకి వెళ్తే తనకి పాసెంజరు దొరుకుతుంది. అది తప్పిపోతే మర్నాడు పదిగంటలదాకా తిరిగిబండీలేదు. చెప్పి వెళ్దామనికా ఆ అమ్మాయి ఇంట్లోలేదు. ఆ పరిస్థితిలో వాడేంచేస్తాడు. కాస్త నమ్మకమైన స్నేహితుడు గాబట్టి రాజాని తీసుకొచ్చి పరిస్థితులు Explain చేసి తనొచ్చే దాకా ప్రభ స్నేహితురాలికి వీణ్ణి సాయంగా వుండమనీ, తను వెళ్ళవలసివచ్చిన కారణాలు ఆ అమ్మాయితో చెప్పమని చెప్పి, తను క్షమించమని అడిగినట్టున్నా చెప్పమని ఏడుగంటల బండికి ప్రభాకరం రైలెక్కేశాడు. తొమ్మిదిన్నరయేటప్పటికి జానకి వచ్చిందిట."

"జానికెవరూ?"

"అదేనోయ్. ప్రభ స్నేహితురాలు. తలుపు

తట్టడంతోటే రాజా వచ్చి తలుపు తీసేడు. రాజాని చూసి జానకీ, జానకిని చూసి రాజా ఓపదిహేను నిమిషాలసేపు కొయ్యబారిపోయేరు.

"ఆఁ" అన్నాడు హఠాత్తుగా రాఘవరావు నోరు పెద్దదిచేసి మొహం పైకెత్తి.

"అసలుసంగతి వినవేం. ఇంతకీ ఆఅమ్మాయి యెవరో తెలుసా!"

"ఎవరేవిటీ?"

"రాజాగాడి కాబోయే భార్య, పెళ్లి చూపులూ, తాంబూలాలు పుచ్చుకోడాలూ అన్నీగూడా అప్పటికే జరిగిపోయేయిట"

ఈ మాట విన్న రాఘవరావు "మరా అమ్మాయి కదేం పోయేకాలం?" అనకుండా వుండలేకపోయేడు. మళ్లీ కాంతారావు చెప్పడం మొదలుపెట్టాడు. రాజా కాస్త ధైర్యంచేసి అడిగాడు. "నువ్విక్కడికెందుకొచ్చావ్" అని. ముందర కాస్త తటపటాయించి, "ప్రభకోసం వచ్చానూ, ఆఅమ్మాయి ఊళ్ళో లేకపోయింది" అని చెప్పిందిట. అప్పటికే కాస్త అధికారం సంక్రమించిందనుకున్న రాజా కాస్త అధికారయుతంగానే అడిగాట్ట "వచ్చిందానివి ఆఅమ్మాయిలేదని తెలుసుకొన్నాక వెళ్ళిపోకుండా యిక్కడెందుకున్నావ్" అని. "వెళ్లి పోదామని స్టేషనుకెళ్ళానూ, రైలు దాటిపోయింది" అని సమాధానం యిచ్చిందట. అందుకు రాజా అన్నదేవిటంటే, "మరి నాతో ప్రభాకరం అల్లా చెప్పలేదే" అని. ఇందుకు తగిన సమాధానం ఆ అమ్మాయికి దొరకలేదుట. చివరికి కొంత బాధతోటి రాజా ఆ అమ్మాయి నడిగాడు ఆమె అసలు ఉద్దేశ్యం ఎవరిమీద వుందో చెప్పమని."

"అంటే ఆఅమ్మాయి ఏమంది?" జానక్కి యెవర్ని పెళ్లిచేసుకోవాలనుందో అన్న సంగతి తెలుసుకోడంలో రాఘవరావు యెంత ఆదుర్దా కనబర్చాడో తెలుసుకుని కాంతారావు మరి కాస్తసేపు రాఘవరావుని తలక్రిందులు చెయ్యడంకోసం—"ఉండవోయ్ మరీ, అంత ఖంగారు పడితే యెల్లాగూ? కాస్త ఓపికపట్టూ"

"మిమల్నే పెళ్లిచేసుకుంటానని, పరిస్థితులు అవగాహన చేసుకున్న ఆ అమ్మాయి చెప్పాక రాజా స్థిమితపడి ఆ అమ్మాయినుంచి అసలు సంగతి తెలుసుకొన్నాక మర్నాడే వాళ్ళవూళ్లో దిగవిడిచి వచ్చాట్ట."

"మరి ఆ అమ్మాయికి ప్రభాకరం మీద మమకారం వుందన్నావ్" అడిగాడు రాఘవరావు.

"అని నాతో ప్రభాకరం గాడన్నాడు"

"అల్లాగయితే తన స్నేహితురాలింట్లో లేకపోయినా ఒంటరిమొగాడింట్లో వున్నప్పుడు తను వెళ్ళిపోక మరి ప్రభ వచ్చేదాకా వుంటానని యెందుకంది!"

దానికి కాంతారావు చెప్పాడు.

"ఆ సంగతే, రాజా నాతో చెప్పినప్పుడు వాణ్ణడిగాను. వాడూ ఆ అమ్మాయిని అదే ప్రశ్న అడిగితే ఆ అమ్మాయి చెప్పిన గమ్మత్తేవిటో తెలుసా!" రెండునెల్ల క్రితం ప్రభా, జానకీ కలుసుకోడం తటస్థించిందిట. అప్పుడేదో మాటల సందర్భంలో ప్రభ అందిటా— "పోవే! నీ పెళ్లికి నన్నెందుకు పిలుస్తావ్!" అని. అందుకు జానకి శపథం పట్టిందిట. ఏమనీ—

"చూసుకో నా పెళ్లికి నిన్ను నేను స్వయంగా వచ్చి తీసుకెళ్ళకపోతే నాపేరు జానకి కాదు" అని. ఆ శపథం నిలబెట్టుకునేందుకు మరో రెండురోజులాలస్యమైనా ప్రభ వచ్చేదాకా వుండి, స్వయంగా తీసుకెళదామనుకుని ప్రయాణం ఆపుచేసుకుందిట. అందుమూలంగా ప్రభాకరం ఒకవిధంగానూ, రాజా మరొకవిధంగానూ అపోహలుపడ్డారు. తరవాత ప్రభాకరం వచ్చి, జానకిని గురించి యేదో అధికారం వున్నట్టు అడిగాడు. వీడు నెమ్మదిగా అసలు సంగతి చెపుతూంటే తనకి కాబోయే భార్యని మోసపుచ్చి వీడిపరం చేసుకునేందుకు యీ పన్నాగం పన్నాడనీ, దావా వేస్తాననీ ప్రభాకరంగాడెగరడంతోటే దిమ్మతిరిగేలాగ రాజాగాడు, ఒక్కలెంపకాయ్ కొట్టి వెళ్ళిపోయేడు. ఆ సంగతన్నమాట ఇంతవరకు నాతో ప్రభాకరంగాడు వెళ్లబోసుకున్న గోడు" అన్నాడు ప్రభాకర్గం వెళ్ళిన వైపు చూస్తూ కాంతారావు. దాంతో రాఘవరావుకి నవ్వాగక నవ్వుతూ, 'హారి! జానకి శపథం యెంతపని చేసింది!' అని రాజానీ, వాడియిదినీ, శ్లాఘించి పారేశాడు.